గుండు చేసిన మేలు!

ఇమంది రామారావు

హోటల్ 'హెవెన్' రూమ్ నెంబర్ ఫైవ్ జీరో ఫోర్ ముందు వందలమంది సినిమా జనం. వాళ్ళని చూడ్డానికి యెగబడుతున్నట్లు వేలమంది జనం.

ఇన్స్పెక్టర్ కిరణ్ ను చూడగానే కానిస్టేబుల్స్ గది తలుపులు తెరిచారు.

ఊహించినంత గందరగోళం ఏం లేదక్కడ. ఫిలిం ప్రొడ్యూసర్ భీమానాయుడు ప్రశాంతంగా నిద్రపోతున్నట్లనిపించింది. గుండు చేయించుకున్నాడు.

రూమ్ అంతా పరికించి చూశారు. డ్రస్సింగ్ టేబుల్ దగ్గర పర్సుంది. పర్సులో వందరూపాయల నోట్లున్నాయి. లెక్కపెట్టాడు కిరణ్. యాభై నాలుగున్నాయి. పర్సు మిగతా అరల్లో చూశాడు. ఏవో అడ్రసులు ఉన్నాయ్. అన్నీ అమ్మాయిల అడ్రసులే. ఇంకో సీక్రెట్ అరవుంది. అందులో యెవరో అమ్మాయి నేకడ్ నెగటివ్ ఉంది.

కిరణ్ శవాన్ని మరోసారి పరీక్షగా చూశాడు.

"రాజూ! డీటైల్‌గా ఇన్‌ఫర్మేషన్ సేకరించండి. పోస్టుమార్టమ్‌కి ప్రొసీడింగ్స్ జరిపించండి. గోవిందురెడ్డి గారూ! కెన్ ఐ హావ్ ఏ పర్సనల్ టాక్ విత్ యూ!" అనడిగాడు. ఆ హోటల్ ప్రొప్రయిటర్ గోవిందురెడ్డి "ష్యూర్ ష్యూర్" అంటూ తన ఆఫీసురూమ్‌కేసి నడిచాడు.

భీమానాయుడు పేరుమోసిన ఫిలింప్రొడ్యూసరు. చాలామంది నటీనటుల్ని తన సంస్థద్వారానే పరిచయం చేశాడు. భీమానాయుడు సినిమా హీరోలాగా ఉంటాడు.

అందుకే చాలామంది హీరోయిన్లు ప్రేమించారు. పెళ్ళికూడా సిద్ధమయ్యారు.

"ఊ.... చెప్పండి!" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు కిరణ్. ఆఫీసంతా ఒకసారి కలియచూశాడు. చాలా మోడ్రన్‌గా ఉంది. అందమయిన అమ్మాయిల అర్ధనగ్న చిత్రాలున్నాయి.

"అసలు ఏం జరిగిందంటే!" అంటూ చెప్పడం మొదలుపెట్టేసరికి యస్. ఐ. రాజు "ఎక్స్‌క్యూజ్ మి సర్!" అంటూ తలుపు తోసి లోపలికి వచ్చాడు.

"ఆయన బెడ్ క్రింద ఈ డెయిరీ ఉంది సర్!" అన్నాడు రాజు ఎర్రటి డెయిరీ అందిస్తూ. ఆ డెయిరీ మీద 'భీమానాయుడు ఫిలిం ప్రొడ్యూసర్' అని గోల్డు లెటరింగ్ ఉంది.

ఇన్‌స్పెక్టర్ కిరణ్ డెయిరీ పేపర్లు స్పీడ్‌గా తిరగేసి చివరి పేజీ కొచ్చాడు.

"డేట్ మే ఒకటి—ఈ రోజు యింటిదగ్గర పుష్పకి చెప్పవలసినవన్నీ చెప్పేను. నా ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసి

పిల్లల గురించి చెప్పాను. తిరుపతి 'సప్తగిరి' ఎక్స్ప్రెస్‌లో వెళ్ళాను. స్పెషల్ దర్శనం చేశాను. దర్శనం బాగా జరిగింది. స్వామివారి విగ్రహాన్ని బాగా చూశాను. 'సప్తగిరి'లోనే బయలుదేరాను.

'హోటల్ హెవెన్' రెడ్డిగారికి ఇంతకుముందు నాలుగువేలు చిల్లర రూమ్‌ఫేర్ బాకీ వున్నాను. నేనీ రాత్రి ఆత్మహత్య చేసుకుంటున్నానని పాపం రెడ్డికి తెలీదు. నా డెయిరీ పోలీసులకి దొరుకుతుంది. వివరాలు చదివితే రెడ్డిగారికి నేనివ్వవలసిన డబ్బు ఇప్పించగలరు. మిస్ లీలారావ్‌కి ఒక వెయ్యిరూపాయలు ఇవ్వాలి.

నా ఆత్మహత్యకు నేనే కారణం. ఇందుకు యెవరూ బాధ్యులుకారు. నా ఆస్తి నాలుగులక్షలు. అప్పులు పదహారులక్షలు. నా జీవితంలో ఈ అప్పులు తీర్చలేను. బ్రతికి నా మొహం చూపించలేను. అందుకే స్లీపింగ్ పిల్స్ తీసుకున్నాను" అంటూ క్రింద సంతకం చేసివుంది.

బరువుగా నిట్టూర్చి డెయిరీని జేబులో పెట్టుకున్నాడు.

"అసలేం జరిగిందం చెప్పండి" అంటూ మొదలుపెట్టాడు రెడ్డి. "నిన్నరాత్రి పదకొండు గంటల ప్రాంతంలో వీరు మా హోటల్లోకి వచ్చారండి. ఆయన మా 'హెవెన్'కి ఎప్పుడొచ్చినా సెంటిమెంటల్‌గా 504లోనే దిగుతారండీ. ఇంతకుముందు డబ్బు యివ్వలేదు కదాని కొంతసేపు తటపటాయించానండీ. మీరు ఒకేసారి తీసుకుందురు కాని, ఇప్పుడు రూమ్ కావాలి! అని పట్టుబట్టారండీ. రూమ్ యిచ్చానండీ. ఇంతవరకే నాకు తెలుసండీ. పదకొండున్నరకి నేను యింటికి వెళ్ళిపోయానండీ. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదండీ. సత్యప్రమాణకంగా చెప్తున్నానండీ!" అన్నాడు గోవిందురెడ్డి

కళ్ళల్లో నీరు తిప్పుకుని.

"ఆయనకి రూమ్ ఎలాట్ చేసింది యెవరు?"

"మిస్ లీలారావ్ అండీ!"

"కొంచెం పిలుస్తారా ఆమెను?" అని అడిగాడు కిరణ్.

లీలారావ్ కీ భీమానాయుడికీ ఏదో సంబంధం వుంది. అందుకే వెయ్యిరూపాయలు ఆమెకోసం కేటాయించాడు. మరోసారి డైయిరీ తిరగేశాడు. లీలారావ్ గురించి రాసిన మాటలు చదివేడు.

"లీలారావ్ చాలా మంచిది. ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతుంది. తెలివిగా సమాధానం చెబుతుంది. లీలారావు నిజంగా దేవత" అంటూ ఒకచోట వుంది.

ఇంటర్ కమ్‌లో లీలారావ్‌తో మాట్లాడేడు, గోవిందు రెడ్డి. నిముషాలమీద లీలారావ్ వాలింది. "యస్ప్లీజ్!" అంది.

లీలారావ్ ఎర్రగా ఎత్తుగా, ఎత్తుకు తగ్గ లావు, ఎంచక్కా అజంతా శిల్పంలా వుంటుంది. పెదవులమీద ఎప్పుడూ నవ్వు దొర్లుతూనే వుంటుంది.

"భీమానాయుడు రూమ్ యెప్పుడు తీసుకున్నారు?"

"నిన్న పదకొండు గంటల ఏడునిమిషాలకి" అంది వాచీకేసి చూసి.

"మీకు భీమానాయుడు చాలా బాగా తెలుసా?"

"చాలా బాగా అంటే?" మిస్ లీలారావ్ కంగారు పడలేదు. నవ్వుతూనే సమాధానం చెబుతోంది. నవ్వుతూనే అడిగింది.

"ఆయన డైయిరీలో మీరున్నంతగా" కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు కిరణ్.

ఆమె నవ్వింది. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు.

"వాట్ డు యూ మీన్" అన్నాడు ముందుకు వంగి.

"లెట్ మీ నో వాట్ డు యూ మీన్" అంది ఎదురుప్రశ్న వేస్తూ.

"మీ యిద్దరి మధ్య సమ్ రిలేషన్ షిప్ వుండితీరాలి!"

"ఒక పాసింజర్ కి, రిసెప్షనిస్టుకీ మధ్య రిలేషన్ షిప్ తప్ప మరొకటి ఊహించకండి."

"ఆయన మీ కెప్పుడయినా డబ్బు ఇచ్చాడా?"

"లేదు!"

"ఇస్తానన్నాడా?"

"లేదు!"

"ఈ హోటల్ కి వచ్చే పాసింజర్స్ లో ఎవరైనా, యెప్పుడయినా టిప్స్ గా వెయ్యిరూపాయలు మీ కిచ్చారా?"

"వెయ్యిరూపాయిలా!" ఆశ్చర్యపోయింది.

"ఏం యివ్వకూడదా?"

"మీరయితే ఇస్తారా?" అంది రక్కున. కిరణ్ మొహం తుడుచుకున్నాడు.

గోవిందురెడ్డి మొహంలో రంగులు మారుతున్నాయ్. ఇబ్బందిగా ఫీలవుతున్నాడు. 'యు కెన్ గో' అన్నాడు కిరణ్, రెడ్డికేసి చూసి. రెడ్డి అక్కడ్నుంచి కదిలాడు. రాజు ఫాలో అయ్యాడు.

"కెన్ ఐ గో!" అంది లీలారావ్ నవ్వుతూ.

"నో, నో. మీరు వుండాలి. అవసరమయితే ఈ కేసు పరిశోధన ముగిసేవరకూ నువ్వు.... సారీ మీరు నాతో ఉండవలసి వస్తుంది!" అన్నాడు.

"ఎందుకని-మీకాక్కవలసిన వివరాలు అడగండి చెబుతాను. పోలీసుల జీపుల్లో తిరిగే అలవాటింకా రాలేదు!" కొంచెం చిరుకోపంతో కూడిన నవ్వు విసిరింది.

"చూడండి మిస్ లీలారావ్ గారూ! మీరొక రిసెప్షనిస్టుగా కాకుండా నా వెల్ విషర్ గా చెప్పండి. నాక్కావలసిన ఇన్ ఫర్మేషన్ అందించండి. నాకు మీరీ విషయంలో సంపూర్ణమైన సహాకారాన్ని అందించాలి!" అంటూ రిక్వెస్టు చేస్తున్నట్లు అడిగాడు.

మిస్ లీలారావ్, కిరణ్ మొహాంలోకి చూసింది.

కిరణ్ అందగాడు. ఆరడుగుల ఎత్తు, నొక్కులజుత్తు, సినిమా హీరోలు చూసి తల దించుకునే పర్సనాలిటీ ఉందతనికి.

"ఏం మాట్లాడరు!" అంటూ లేచినిలబడ్డాడు.

"ఇక్కడేం మాట్లాను. మనం ఏం మాట్లాడుకున్నా రెడ్డిగారు వింటారు. సౌండ్ కనెక్షన్ వుంది. అదిగో చూశారా రెడ్ లైట్. క్రిందనుండి రెడ్డిగారు మన మాటలు వింటున్నారు. మిమ్మల్ని తర్వాత కలుసుకుంటాను" అంటూ కాగితంమీద రాసింది తెలివిగా.

మిస్ లీలారావ్ ని అభినందించకుండా వుండలేక పోయాడు ఇన్ స్పెక్టర్ కిరణ్.

2

"ఆయన నిన్న ఉదయం ఎన్ని గంటలకు ఇంటినుండి బైటికి వెళ్ళారమ్మా!" శోకసముద్రంలో వున్న భీమా నాయుడి భార్య పుష్పను ప్రశ్నించాడు కిరణ్.

"అయిదు గంటలకి!" దుఃఖాన్ని ఆపుకుంటూ జవాబు చెప్పింది.

"ఆయన యెవరికయినా ఫోన్లు చేశారా!"

"చేశారు!"

"సుమారు ఎన్ని ఫోన్లు చేసివుంటారు?"

"అలాంటి విషయాలు నేను పట్టించుకోనండీ. నిన్న మాత్రం ఆయన ఎప్పటిలాగే నాలుగ్గంటలకి లేచిపోయి, నన్ను పిల్లల్ని లేపి చాలా హేపీగా మాట్లాడారు. ఈ మధ్యకాలంలో అంత హేపీగా మాట్లాడ్డం ఎప్పుడూ చూడలేదు. తర్వాత ఫోన్లు చేశారు-నాలుగయిదు ఫోనులుంటాయండీ...." అంది పుష్ప.

పుష్ప పాతకాలం మనిషి. మాటతీరు, చూపుతీరు చూస్తే కొంత వెనకపడిన తత్వం స్పష్టమౌతోంది.

"ఆయన ఈ మధ్య ఏమయినా బాగా నష్టపోయారా?"

"ఏమోనండి, ఆయన మాకు తిండీ బట్టా తప్ప, మిగతా విషయాలు చెప్పడంగాని, నేను అడగడంగాని యింతవరకూ జరగలేదు."

"స్త్రీ సావాసాలు ఎక్కువట కదమ్మా!" అన్నాడు కిరణ్ ఇబ్బందిగా మొహంపెట్టి.

రియాక్టయింది పుష్ప. కోపం ముంచుకొచ్చింది.

"మీలా కొందరు అనడం తప్ప నాకు తెలీదు. సినిమాఫీల్డు కదండీ గోరంతలు కొండంతలు చేస్తారు. అయినా మా వారిమీద నాకు నమ్మకముంది. నన్ను సుఖపెట్టారు. పిల్లలు ముగ్గుర్నీ సుఖపెడుతున్నారు. ఆయనకేం రాజా—ఆయన మాటకి నేను పెళ్ళియినప్పటినుండీ ఎదురు చెప్పలేదు-ఎదురుచెప్తే ఆయన సహించలేరు. ఆయన అనుకున్నది జరిగితీరాలి. జరగలేదో దాని అంతు చూస్తారు. ఆయనకి కోపమొచ్చినా, సంతోషమొచ్చినా తట్టుకోలేరు" అంటూ ఏడుపు ఆపుకోలేకపోయింది

పుష్ప—

భీమానాయుడు బెడ్‌రూమ్, రీడింగ్‌రూమ్ కలయ చూశాడు కిరణ్. భీమానాయుడికి మంచి టేస్టువుంది. అందమయిన మాడ్రన్ ఆర్టు ఇంటినిండా వుంది.

"పిల్లల పేరునగాని. మీ పేరునగాని ఏవైనా ఇన్సూరెన్స్ చేయించారామ్మా?"

"ఏం తెలీదండీ!"

పుష్ప ఏవడిగినా తెలీదంటుంది. పిల్లలు ముగ్గురూ చిన్నవయసులోవున్న పిల్లలే. పెద్దవాడికి పన్నెండు సంవత్సరాలుంటాయి. చిన్నపిల్లకి ఎనిమిది సంవత్సరాలుంటుంది. మరో చంటిపాప వుంది. రెండు సంవత్సరాల వయసుంటుంది.

డైరీలో దాచిన కొన్ని కాగితాలు తీసి ఎడ్రసులు చూశాడు. మూడు ఎడ్రసులున్నాయి. మూడూ లేడీస్ ఎడ్రసులే.

"సువర్ణ, ఇందిర, పద్మ వీరి ముగ్గురు పేర్లు యెప్పుడయినా విన్నారా!"

"చూశానండి!"

"ఎప్పుడు."

"వేషాలకని మా యింటికి ప్రతిరోజూ వచ్చేవారు. చాలామంచి పిల్లలు" అని సర్టిఫికేట్ యిచ్చింది.

కిరణ్ ఆశించిన సమాధానం ఒకటీ దొరకటంలేదు. పుష్ప అమాయకురాలని నిస్సందేహంగా చెప్పొచ్చు. సనాతన ఆచార, ధర్మాలు తు.చ. తప్పకుండా పాటించే మనిషి. భర్తంటే దేవుడులా చూసుకుంటుంది. బహుశా,

తన దృష్టిలో అందరూ మంచివాళ్ళే నేమో. ఆమెకు ధైర్యం చెప్పి బయటికి నడిచాడు.

3

కిరణ్ జీపులో కూర్చున్నాడేగాని ఆలోచనలు.

డైరీ యింకోసారి తిరగేశాడు. సువర్ణ, ఇందిర, పద్మ ముగ్గురూ ఒకే ప్రాంతంలో వుంటున్నారు. వెస్టు కె.కె. నగర్ మెయిన్ రోడ్‌లో. సువర్ణ హౌస్ నెంబరు 91 లోనూ, ఇందిర 80 లోనూ, పద్మ 70 లోనూ వుంటున్నారు.

ముందు 'పద్మ' యిల్లు కనిపించింది. బయట 'పద్మ' సినీ ఆర్టిస్ట్ అని బోర్డుంది.

జీపు ఆగింది.

కిరణ్ ఒక్కడే లోపలికి నడిచాడు.

పద్మ కిరణ్‌ని చూసి బెదిరిపోయింది. ఖాకీబట్టలు చూసేసరికి యెవరికయినా కంగారు పుట్టుకురావడం సహజం.

"మిస్ పద్మ ఎవరు?" అన్నాడు కిరణ్ పద్మని పరీక్షగా చూస్తూ.

"నేనే.... నేనే సార్. కూర్చోండి సార్!" అంది తడబడుతూ.

"కంగారు పడకండి. ఊరికే చూసి వెడదామని వచ్చాను!" అన్నాడు భయం పోగొట్టడానికి.

"ఇంతకుముందు మా యింటికి ఎపుడయినా వచ్చారా?" అంది పద్మ ఆలోచిస్తూ.

పద్మ మరోరకంగా ఆలోచిస్తోంది. పోలీసులు సినిమా నటుల యింటికి రావడం, మంచి చెడు మాట్లాడ్డం, పదో పాతికో పట్టుకుపోవడం అలవాటే—సబ్ ఇన్స్పెక్టరూ

ఇన్ స్పెక్టర్లూ అయితే అకేషనల్ గా రావడం, ఒక్కపూట వుండి 'విందు' ముగించుకొని వెళ్ళిపోవడం పరిపాటే! అలాంటి దృష్టితో అడిగింది పద్మ.

"నేను ఇంతకుముందు రాలేదు—మీకు ఫిలిం ప్రొడ్యూసరు భీమానాయుడు గారితో పరిచయముందా?" అన్నాడు కిరణ్ కూర్చుంటూ.

టీపాయ్ మీద అందమయిన తెలుగు ఇంగ్లీషు తెలుగు సినిమా స్టార్ల బొమ్మల్ని సంతరించుకున్న బుక్సున్నాయి. కిరణ్ పద్మ ఇంటిని పరిశీలించసాగాడు.

ఇల్లు పెద్ద రిచ్ గా ఏంలేదు. సంపాదన వందల మీద నే అయివుంటుంది.

"భీమానాయుడు గారు తెలుసండీ అంతవరకే! "అంది వినయంగా.

"మీ అడ్రసు ఆయన దగ్గరుందా?"

"వుండొచ్చు. ఒకసారి అడ్రసిచ్చి వెళ్ళమ్మా.... కబురు చేస్తానన్నారు."

"కబురు చేశారా!"

"లేదు!"

"పోనీ మీరు కలిశారా!"

"చాలాసార్లు కలిశాను. సినిమా షూటింగు పార్టు ఫినిష్ అయ్యేంతవరకూ చూశాను. పిక్చర్ ఫినిషయ్యాక వెళ్లలేదు. అన్నట్లు ఆ సినిమా ఈ మధ్యనే విడుదలయింది. ప్లావ్ అయింది కూడా" అంది ఆ సినిమాకి సంబంధించిన ఇన్ ఫర్మేషనిస్తూ.

"చూడండి! భీమానాయుడుగారు చనిపోయారు మీకు తెలుసా?"

షాక్ ఫీలయ్యింది. కాసేపు మాట్లాడలేకపోయింది

పద్మ.

“చనిపోయారా? ఎప్పుడండి....ఎలా....?” ప్రశ్నల వర్షం కురిపించింది.

“హోటల్ హెవెన్ రూమ్ నెంబర్ 504లో చనిపోయారు. ఆత్మహత్య చేసుకున్నారు.”

“ఆత్మహత్య....ఆత్మహత్య భీమానాయుడుగారు చేసుకున్నారా? నో అలా జరగటానికి వీల్లేదు సార్!” అంది పద్మ.

“ఏం! ఆయన గురించి అంతా తెలుసా?”

“ఆఁ!.... నేను ఒకసారి వెళ్ళినపుడు నా ఫామిలీ ఎఫైర్స్, ఇండస్ట్రీలో నేను ఫేస్ చేసిన ప్రాబ్లెమ్స్ అన్నీ చెప్పి, మాటల సందర్భంగా ఆత్మహత్య చేసుకుంటానని చెప్పేశాను....అంతే ఆయన గంటసేపు ఉపన్యాసం ఇచ్చారు. ఆత్మహత్య మహాపాపమని మనల్ని మనం చంపుకునే హక్కు లేదని, ఏదయినా కష్టం వస్తే ధైర్యంగా, ఎదొర్కోవాలని, ఎంతో నచ్చచెప్పి నా చేతిలో అయిదువందల రూపాయలు పెట్టారు. అంత మంచిమనిషి ఆయన.

ఓ రోజు అరుణాచలం స్టూడియోలో షూటింగు జరుగుతుంది. ఆయన వున్నారని తెలిసి కలవటానికి వెళ్ళాను. చీకటి పడింది. బిజీగా వుండబట్టి వెంటనే మాట్లాడి పిలిపించలేకపోయారు. నేను ఓపిగ్గా షూటింగ్ ‘పేకప్’ అయనంతవరకూ వున్నాను.

‘వుండు పద్మా ఇంటి దగ్గర డ్రాప్ చేస్తా’ నన్నారు.

కారులో ఆయన ఫ్రంట్ సీట్లో కూర్చున్నారు. నేను బాక్ సీట్లో కూర్చున్నాను. డ్రైవరు కారు స్పీడుగా పోనిచ్చాడు. ఆయన అదిరిపోయారు. ఒకటి రెండుసార్లు

మందలించాడు.

"ఏమిటిది. నువ్వు మనిషివా! పశువ్వా. చెబితే వినిపించుకోవేం. దేనితోనైనా ఆడుకోగానీ, మనుషుల ప్రాణాలతో ఆడుకోకు!" అన్నారు.

డ్రైవరు వినిపించుకోలేదు. "ఇంతకంటే స్లోగా ఎలా తోలమంటారండీ!" అంటూ ఎదురుతిరిగాడు.

అంతే! కారు ఆపుచేయించి తను స్వయంగా డ్రైవ్ చేశారు! ప్రాణాలంటే అంత తీపి ఆయనకి—ఎవరికయినా కష్టం వచ్చిందంటే తనకు తోచిన సహాయంచేసే ధర్మాత్ముడు ఆయన!" అంటుండగా పద్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

కిరణ్ ఆలోచనల్లోపడ్డాడు. భీమానాయుడు గురించి భీమానాయుడు భయం గురించీ వివరంగా చెప్పింది పద్మ. అంటే అతను ఆత్మహత్య చేసుకోలేదు, చేసుకోలేడు. ఎవరో చంపివుండాలి. తన అనుమానమే నిజమైంది.

ఎవరు చంపుతారు? భీమానాయుడ్ని చంపవలసిన అవసరం ఎవరికి వుంటుంది. గోవిందురెడ్డి చంపాడా? చంపడానికి అవకాశాలు తక్కువ. మిస్ లీలారావ్‌కీ భీమానాయుడికీ మధ్య ఏమిటి సంబంధం. లీలారావ్ తనను పర్సనల్‌గా కలుసుకొని మాట్లాడుతానని ఎందుకు చెప్పింది? ఇందులో గోవిందురెడ్డికి ఏమన్నా భాగముందా? లీలారావ్ గోవిందురెడ్డిముందు తనకు తెలిసిన వివరాలు చెప్పటానికి ఎందుకు నిరాకరించింది?

పద్మ ఏమన్నా నాటక మాడుతుందా? నిజంగా పద్మకి భీమానాయుడితో పర్సనల్ టచస్ వుంటే ఇంత పూర్ లైఫ్ అనుభవించవలసిన అవసరముండదు.

"పద్మగారూ! మీ రీ మధ్య ఆయన్ని కలవడం

జరిగిందా?"

"లేదండీ!"

"ఆయన కలవడం జరిగిందా?"

"రెండూ ఒకటే కదండీ!" నవ్వింది.

"భీమానాయుడికీ ఇందిర, సువర్ణలకీ ఏమయినా సంబంధం వుందా? మీ అడ్రసుతోబాటు వారిద్దరి ఎడ్రసులూ దొరికేయి! ఆయన పర్సులో వున్న ముగ్గురు భామలు మీ ముగ్గురూ—వారిద్దరి గురించి మీకు ఎంత వరకూ తెలుసు?"

"వాళ్ళూ చిన్న చిన్న వేషాలు వేస్తుంటారండీ.... మేం ముగ్గురం కలిసి వెళుతుందేవారం ఆయనింటికి ఆటోలో....

ముగ్గురం మా ఇంటి దగ్గర్నుంచే బయలుదేరి వెళ్ళే వారం ఆటో, టాక్సీ, డబ్బులు కలిసొస్తాయని—అంతే—మిగతా వివరాలు నాకు తెలీదు. నాకు తెలిసి భీమా నాయుడికి మాతో తిరగవలసిన పనిలేదు. వారు తలుచుకుంటే అగ్రశ్రేణి కథానాయికలంతా పరుగెత్తుకు వస్తారు!" అంది పద్మ.

పశాస్ నెంబర్ 80కి దారితీశాడు కిరణ్.

ఇందిర ఇల్లు. కొంచెం మాడ్రెన్‌గా వుంది. ఇంట్లో ఇద్దరు అమ్మాయిలున్నారు. కిరణ్‌ని చూసి నవ్వింది ఇందిర యింతకుముందు పరిచయమున్నట్టు — కిరణ్ నవ్వాడు.

"ఏంటి సార్ యిలా వచ్చేశారు?" అంది పరిచయంగా.

"మిమ్మల్నిచూడాలని, 'సువర్ణ' గారిల్లు ఈ ప్రక్కనా—"

ఇందిర ప్రక్కకు చూసింది. బహుశా ఆమె 'సువర్ణ' అయివుండొచ్చు.

"ఈమె సువర్ణ ...." అంటూ పరిచయం చేసింది. తను 'ఇందిర' అని తెలుస్తోంది. ఇంట్లో మరెవరూ లేరు. అర్ధ నగ్న ఛాయాచిత్రాలున్నాయి. సినిమా కోసమని తీయించుకున్న స్టిల్స్ ఫుల్ సైజులోనివి ఫ్రేమ్ చేసినవి గోడకి తగిలించి వున్నాయి.

"మీరు ప్రస్తుతం సినిమాల్లో నటిస్తున్నారా?" ఫోటో చూస్తూ అడిగాడు కిరణ్.

"మలయాళం చిత్రాల్లో చేస్తున్నాను" అంది ఇందిర ధైర్యంగా.

"మీరు కూడా ఏవైనా ఫిల్మ్స్ చేస్తున్నారా?" అన్నాడు సువర్ణను చూస్తూ. తల దించుకుంది. బదులు చెప్పటానికి సిగ్గుపడింది.

"తనేం చేయడంలేదండీ! మలయాళంలో రెండు మూడు పిక్చర్స్ ఆఫర్స్ వచ్చాయి. ఒప్పుకోలేదు. ముందు మాతృభాషా చిత్రాల్లో చేసిగాని పరభాషా చిత్రాలు ఒప్పుకోదట. ఈవిడగారు గాంధీగారి మనుమరాలు. సెక్స్ క్రైమ్ ఫేంటసీ ఇలాంటి సినిమాలు ఒప్పుకోదు. ఈవిడగారి గురించి కుటుంబగాథ చిత్రాల్ని మాత్రమే ప్రత్యేకించి తయారు చేయించాలి!" అంటూ జోక్ చేసినట్లు ఫీలయి నవ్వింది. సువర్ణ ముక్కుపుటాలమీద చిరుకోపం పొడుచుకొచ్చింది.

"తెలుగు ఫిలిం ప్రొడ్యూసరు భీమానాయుడు చనిపోయాడు. మీకు తెలుసా?" అనడిగాడు కిరణ్.

"అవునట పాపం!" అంది ఇందిర.

"ఎప్పుడు తెలిసింది?"

"యిప్పుడే తెలిసింది!"

"ఎలా తెలిసింది!"

"అదేవిట్సార్ పిల్ల పుడితే పేరు దాగుతుందా! భీమా నాయుడుగారంటే ఎవరికి తెలీదు? ఆయనకి అమ్మాయిల పిచ్చి—సారీ ..." అంటూ నాలుక్కొరుచుకుంది ఇందిర.

ఇందిర గడగడా మాట్లాడేస్తుంది మనసులోనున్నది. ఏదీ దాచుకోదు. పసిపిల్ల మనస్తత్వం అనిపిస్తోంది.

"ఆయనంత పచ్చిగా తిరుగుతుండేవారా?" అనడిగాడు కిరణ్.

"పోలీసువాళ్లు—మీతో జాగ్రత్తగా మాట్లాడాలి. నోరు పారేసుకున్నాను. క్షమించండి సర్. ఆయనకి ఆడవాళ్ళంటే మహాపిచ్చి. అందమయిన ఆడది కనిపిస్తే, వేలు, లక్షలయినా ఖర్చు పెట్టి బలవంతంగానైనా ఆమెను పొందేవారట. అంతటి రసికుడట. మాలో మేం కథలు కథలుగా చెప్పుకోవడమేగాని పర్సనల్ ఎక్స్పీరియన్స్ ఎవరికీ లేదుసార్!" అంది ఇందిర నిర్మొహమాటంగా.

కిరణ్‌కి మెదడు చురుగ్గా పని చేయసాగింది. మరి సువర్ణ, ఇందిర, పద్మల ఎడ్రసులు ఎందుకున్నట్లు? ఆఫీసులో వుండొచ్చుకదా? అసలు భీమానాయుడికి వీరు ముగ్గురుగాక యింకా చాలామందితో సంబంధం వుందన్న మాట.

"భీమానాయుడుగారికి మంచి గర్ల్ ఫ్రెండ్స్ ఎవరో చెప్పండి. పోలీసు డిపార్టుమెంట్‌కి మీరు ఎంతో సహాయం చేసినవారౌతారు. భీమానాయుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన డైరీలో వుంది. భీమానాయుడు మన స్తత్వం దృష్ట్యా ఆయన ఆత్మహత్య చేసుకోలేదని

ఎవరో ప్రయత్నం మీద హత్య చేశారని అనిపిస్తోంది. యెవరో చాలా తెలివిగా హత్య చేశారు. బయటపడని విధంగా హత్య చేశారు. భీమానాయుడికి బాగా క్లోజ్ గా యెవరుంటారు? యెవరంటే భీమానాయుడికి ప్రాణం కొంచెం వివరంగా చెప్పి హెల్ప్ చేయండి" అన్నాడు కిరణ్.

కిరణ్ అందరితో స్నేహపూర్వకంగా వుంటాడు. ఆయనతో మాట్లాడుతుంటే ఒక పోలీసాఫీసరుతో మాట్లాడుతున్న ఫీలింగు ఎవరికీ వుండదు. అంత ఆత్మీయతా భావం వుట్టిపడుతుంది ఆయన మాటల్లో.

ఇందిర ఏదో చెప్పటానికి కొంచెం అనుమానిస్తోంది.

"ఊఁ చెప్పండి. ప్లీజ్!" అంటూ ముందుకు జరిగాడు.

"వర్ధమాన హీరోయిన్ సంధ్యగారితో ఎక్కువ చనువుగా వుంటాడు. ఆమెను ఫీల్డుకు పరిచయం చేసినది ఆయన. ఏమో సార్, మాకు తెలిసినంతవరకూ చెప్పాం. ఈ కేసు విషయంలో మీరు చాలా టైర్ అయినట్లుంది. వుండండి. 'లంచ్' తీసుకొని కాస్సేపు విశ్రాంతి తీసుకొని వెడుదురు" అంది ఇందిర నవ్వుతూ. ఆ నవ్వుకి అర్ధం మరొకటి.

"నో థాంక్స్! అవసరమయితే మీరు ఓసారి స్టేషన్ కు రావలసి వుంటుంది. ఓ.కే?"

"ఓ.కే. సర్ విత్ ప్లెజర్!" అన్నారు యిద్దరూ కూడబలుక్కున్నట్లు.

ఇన్స్పెక్టర్ కిరణ్ మౌంట్ రోడ్ కేసి జీపు పోనిచ్చాడు.

4

డిటెక్టివ్ సాయిబాబా త్రిబుల్ ఫైవ్ వెలిగించి గుప్పుగుప్పుమంటూ పొగలు గ్రక్కుతున్నాడు.

గోవిందురెడ్డి, విగ్రహంముందు పూజారిలా వినయంగా తన గోడు వినిపించుకోడానికి సిద్ధంగా వున్నాడు.

"శవాన్ని పోస్టుమార్టమ్ చేయించారా?" అనడిగాడు సాయిబాబా.

"లేదుసార్. కిరణ్ గారు డెడ్ బాడీని అలాగే ఆపమని లేబ్ కి ఫోన్ చేసి డెడ్ బాడీ డిస్టర్బ్ అవకుండా కెమికల్ ప్రొటెక్షన్ తో, చూడమని మెసేజ్ పంపించారట—"

"యెందుకట!" అర్థంకానట్లు జులపాలు నొక్కుకున్నాడు.

"తెలిస్తే మీ దగ్గరికి ఎందుకు వస్తాను! నాకు భయంగా వుంది సర్. భీమానాయుడుగారు హోటల్ కి రావడం టౌన్ లో అందరికీ తెలుసు. ఫైవ్ జీరో ఫోర్లో బస చేయడం కూడా తెలుసు. వున్నట్లుండి సడన్ గా ఆయన డెడ్ బాడీ కనిపించింది" ఆయాసంగా రొప్పుతున్నాడు గోవిందురెడ్డి.

"ఆయన రూమ్ లో ఇంకేవన్నా కనిపించాయా?"

"డెయిరీ కనిపించింది సర్!"

"ఆ డెయిరీలో ఏముంది?"

"కిరణ్ గారు చూశారు ఏముందో—"

"బహుశా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాసి వుండొచ్చుకదా."

"అవున్సార్."

"స్లీపింగ్ పిల్స్ బాటిల్ కనిపించిందా?"

"లేదు సర్!"

"ఏం తాగి చనిపోయాడట!"

"స్లీపింగ్ పిల్స్ వేసుకొని పోయినట్లే అనుకుంటున్నారు సర్!"

డిటెక్టివ్ సాయిబాబా మరోసారి తలగోక్కున్నాడు.

"పిల్స్‌తోబాటు బాటిలు కూడా మింగేశాడటా!" క్వొచ్చన్ మార్క్ మొహం పెట్టాడు సాయిబాబా.

"కావొచ్చు సర్!" అన్నాడు గోవిందురెడ్డి అమాయకంగా. సాయిబాబా గతుక్కుమన్నాడు.

"నీకెంత ఇవ్వాలన్నావ్?" తన ధోరణిలో ప్రశ్నలు కురిపిస్తున్నాడు సాయిబాబా.

"నాలుగు వేలు చిల్లర—అవ్వి ఇవ్వకపోయినా పరవా లేదు. కేసుమాత్రం నామీదకు రాకూడదు. మీ కెంత ఫీజు ఇచ్చుకోమన్నా ఇచ్చుకుంటాను!" అని ప్రాధేయపడ్డాడు.

డిటెక్టివ్ సాయిబాబా ప్రయత్నం మీద నవ్వాడు ఇదెంతమాట అన్నట్లు.

"ఇంతకుముందు మీ హోటల్లో ఇలాంటి కేసులు జరిగాయా?"

"లేదండీ! ఇదే ఫస్టు టైమ్!" బాధగా అన్నాడు.

"అయితే తప్పకుండా ఈ కేసు నీ నెత్తిన పడుతుంది. నీకు నాలుగయిదు వేలు బాకీవున్నారని నువ్వే చెబుతున్నావ్. మనలో మనమాట. నువ్వు ఆయనకి ఎప్పుడయినా అమ్మాయిల్ని సప్లయ్ చేయడం జరిగిందా?" అనుమానంగా అడిగాడు సాయిబాబా.

"రామ రామ! అలాంటి అలవాట్లు నాకు లేవండీ, ఆయన అడగలేదు నేను చేయలేదు. మా రిసెప్షనిస్టు

లీలారావ్ మీద మాత్రం నాకు అనుమానం. ఎందుకంటే ఆమెమీద చాలామంది పెద్దమనుషులు మనసుపడ్డారు. ఆ మనసుపడ్డ మనుషుల్లో భీమానాయుడుగారు గొప్ప పెద్దమనిషి. ఆయన గురించి వివరాలు ఆమెకే తెలిసి వుంటాయి. కాని గడుసుది. చాలా తెలివయింది. చెప్పదు. మీరు పిలవమంటే పిలుస్తాను" అన్నాడు గోవిందురెడ్డి.

"లేదు! ఆమె ఎడ్రసు ఇవ్వండి. నేనే కలుస్తాను!" అన్నాడు సాయిబాబా.

ఆమె ఎడ్రసు ఇచ్చాడు గోవిందురెడ్డి.

సాయిబాబా ఎడ్రసుకేసి పరీక్షగా చూశాడు.

"సాలిగ్రామంలో వుంటుందా?" అనడిగాడు మరోసారి చూసి.

"అవునండి!"

"మీకేం భయంలేదు. అసలు ఇలాంటి విషయాల్లో ఇన్వెస్టిగేట్ చెయ్యవలసింది మేం.... పోలీసులకేం తెలుసు? మేం ఫలానాచోట వున్నారు పట్టుకోండి అంటే వాళ్ళు తీసుకొస్తారు. బైదిబై—గోవిందురెడ్డిగారూ! మిమ్మల్ని కిరణ్ కలవొచ్చు! క్రాస్ ఎగ్జామిన్ చెయ్యొచ్చు! బెదిరించొచ్చు. మీరేం అధైర్యపడకండి. భీమానాయుడికి అమ్మాయిల పిచ్చి వుంది కదా. ఏ అమ్మాయితో మీ హోటల్‌కి ఎక్కువసార్లు వచ్చాడో, ఎవరితో ఎక్కువ గడిపాడో ఆమె పేరు యెడ్రసు సేకరించండి. మరోసారి ఫైవ్ జీరో ఫోర్‌ని బాగా వెదికించండి. ఏవయినా ఆధారాలు దొరకచ్చు!" అన్నాడు సాయిబాబా సిగరెట్ అంటించుకొని. తర్వాత జులపాలు సవరించుకొని టవల్‌తో మొహం తుడుచుకున్నాడు సాయిబాబా చేతిలో 'హోటల్ హెవెన్' కవరు పెట్టి

వెళ్ళిపోయాడు గోవిందురెడ్డి.

సాయిబాబా కవరు చింపి చూశాడు. అందులో ఒక లెటరుంది. పది వందరూపాయనోట్లున్నాయి.

"మే ఐ కమిన్!" అంటూ తలుపుతట్టిన చప్పుడు.

"య్యాస్....కమిన్!" అన్నాడు సాయిబాబా హుందాగా.

"ఇన్స్పెక్టర్ కిరణ్!" అన్నాడు గొణుక్కుంటూ.

"య్యాస్ ప్లీజ్....కెన్ ఐ సిట్ హియర్!" అన్నాడు కిరణ్.

చేతిలో డబ్బుని తడబాటుగా జేబులో వుంచుకున్నాడు సాయిబాబా.

"ఏమిటిలా దయచేశారు?" అన్నాడు గౌరవంగా సాయిబాబా.

"మీ సహాయం కావాలి!"

"నా సహాయమా! మీకా!....మీరు పెద్ద ఇన్స్పెక్టర్ కదా!"

"మీకంటే కాదులెండి!"

"పొగుడుతున్నారు...." అంటూ పెద్దగా నవ్వాడు-కాదు-నవ్వడానికి ప్రయత్నించాడు సాయిబాబా.

"మీకు గిరాకీ బాగా వున్నట్లుంది!" అన్నాడు కిరణ్ పాకెట్‌లో వందరూపాయి నోట్లమీద చూపు నిలిపి.

"మ్చి....మ్చి....ఆ....చెప్పండి గురువుగారూ! ఏమిటి కాఫీయా హార్లిక్స్... కూల్ డ్రింకా..హాట్ మీకు పట్టదు కదా!" అన్నాడు సాయిబాబా చనువుగా.

"భీమానాయుడు అనే ఫిలిం ప్రొడ్యూసరు మీకు తెలుసుకదూ?"

"విన్నాను!"

"ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు!"

"అదీ విన్నాను!"

"ఆత్మహత్య కాదని నా అనుమానం!"

"ఇది కూడా విన్నాను!" అన్నాడు తలూపుతూ.

"ఎవరు చెప్పేరు?" సడన్ గా రివర్సయ్యాడు కిరణ్.

"ఏమంటారు?" అంటూ తృప్తిపడిసర్దుకోటానికి ప్రయత్నిస్తూ.

"ఇప్పుడే ఎవరో క్లయింట్ వచ్చి వెళ్ళాడు. మాటల సందర్భంగా.... ఊరికే పిచ్చాపాటిగా దొర్లాయి ఇవన్నీ" అంటూ చిన్నగా నవ్వాడు.

"హోటల్ హెవెన్ ప్రొప్రయిటరు గోవిందురెడ్డి తెలుసా?"

"తెలుసా? అంటే తెలీదు. తెలీదా అంటే తెలుసు. మనకేం పనుంటుందండీ హోటల్ ప్రొప్రయిటర్స్‌తో- చాలా మంచివాడని విన్నాను!" అన్నాడు త్రిబుల్ ఫైవ్ నోట్లో పడేసుకొని.

"ఆయన మంచితనంమీద మీకు నమ్మకం వుందా?"

"అందరూ అనుకొంటున్నది వినడమే తప్ప మనకి పూర్వాపరాలు ఏం తెలుస్తాయి చెప్పండి! దిగితేనేగా 'లోతు' తెలిసేది" అన్నాడు సాయిబాబా.

"ఆయనే ఈ హత్యచేసినట్లు నా అనుమానం!" అన్నాడు సాయిబాబా మొహంలో మరీ రంగుల్ని గమనిస్తూ.

"ఎందుకు చేసాడంటారు?"

"అదే మీరు తేల్చుకోండి. మీ సహాయం ఇందులో కావాలి!"

"ఆయన రూమ్‌లో దొరికిన డైయిరీలో తనే స్వయంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వుందిట కదా!"

"ఎవరు చెప్పేరు?"

"ఆ..ఆ..ఇందాక మీరు రాకముందు ఓ క్లయింట్‌తో పిచ్చాపాటీ మాట్లాడుతుంటే దొర్లింది."

"మీ క్లయింట్ ఇంకా ఏం చెప్పేడు?"

"ఈ విషయాలన్నీ ఆయనకేం తెలుస్తాయి. బయట విన్నది చెప్పాడు. ఇంతకీ ఆ డైయిరీలో ఏం వుందిట?"

"ఆత్మహత్య చేసుకుంటున్నానని వుంది!"

"ఆయనే ఆత్మహత్య చేసుకోవొచ్చుగా! పైగా మనిషి బాగా దేనికైనా తెగించినవాడని విన్నాను!"

"ఎవరు చెప్పారు?" కిరణ్.

ఈసారి సాయిబాబాకి చిరుకోపం ముంచుకొచ్చింది.

"ఎవరు చెప్తారండీ. కోర్టులో ముద్దాయిని అడిగినట్లు అన్నిటికి సాక్ష్యాలూ, ఆధారాలూ అడుగుతారు. కావలసినవారు కదా ఈ కేసుని హేండిల్ చేసింది మీరు కదా అని వృత్తి ధర్మంతో మాట్లాడుతాం. మేం విన్నది మాట్లాడుతాం. అనుకున్నది మాట్లాడుతాం" అన్నాడు సాయిబాబా.

కిరణ్ చిన్నగా నవ్వాడు. ఆ నవ్వు సాయిబాబా గుండెల్ని దొలిచేసింది.

"సాయిబాబాగారూ! తనే ఆత్మహత్య చేసుకొంటున్నట్లు రాశాడు. కాని రైటింగ్‌లో 'మార్పు' వుంది. ఎవరో కావాలని ఈ హత్యచేసి తన హేండ్‌రైటింగ్ స్టైయిల్‌తో వారికి కావల్సిన మేటరురాసి హత్యచేసారని నా అనుమానం!" అన్నాడు కిరణ్.

"మీకభ్యంతరం లేకపోతే ఆ డైయిరీ చూపించండి!"

"ఓ ష్యూర్!" అంటూ డైరీ అందించాడు. డైరీ పరిశీలనగా చూసి, చివరి పేజీ చదివాడు. ఆద్యంతమూ, మరోసారి చదివేడు సాయిబాబా.

"ఇందులో నాలుగయిదు హాండ్ రైటింగ్ లతో డైరీ రాసివుంది. చివరి పేజీలోని హాండ్ రైటింగ్ మధ్య పేజీల్లో కొన్నిచోట్ల వున్న హాండ్ రైటింగ్ కి ఈక్వల్ గావుంది గనుక—ఆయనే మనసు బావున్నప్పుడు స్పష్టంగా, చికాగ్గా వున్నప్పుడు గజిబిజిగా ఎందుకు రాసి వుండకూడదు?" అన్నాడు సాయిబాబా ఏదో పాయింట్ అందించినట్లు ఫీలయ్యి.

"నిజమే! చివరి పేజీ చూడండి! మీరన్న ప్రకారం కాన్సెప్ట్లో ఆత్మహత్య చేసుకుంటాడనగా రాసింది. చాలా అందంగా వుందే. దీని మాటేమిటి?" అన్నాడు కిరణ్.

"ఆరిపోయేముందు ఏ దీపమైనా బాగా వెలుగుతుం దండీ!"

"మీరు చాలా 'బ్లయిండ్'గా మాట్లాడతారు. మిస్టర్ సాయిబాబాగారూ! భీమానాయుడుగారు ఆత్మహత్యా ప్రయత్నం చేసింతర్వాత అన్ కాన్షియస్ గా వుంటు న్నప్పుడు రాసివుంటాడా ఈ పేజీలో తను చని పోతున్నానని తన చావుకు ఎవరూ బాధ్యులుకారని."

"ముందే ఎందుకు రాసి వుండకూడదు!"

"కరెక్టు! ఈ డైరీ మీరు పరీక్షగా చూడలేదు. భీమానాయుడి అభిరుచుల దృష్ట్యా, ఏదయినా క్రియా రూపంలో జరిగిం తర్వాతే డైయిరీలో రాసేవాడు.... చూడండి. ప్రతి సెంటెన్స్ పాస్టెన్స్ లో వున్నై. ఫలానా వారిని కలిశాను. ఫలానావారితో మాట్లాడాను.

ఫలానా ఊరు కేంప్ వెళ్ళి వచ్చాను. ఏదీ ముందు రాసించి లేదు. దీన్నిబట్టి ఏదయినా ఒకపని పూర్తిగా జరిగిం తర్వాత, దానిగురించి చెప్పడంగాని, రాయడంగాని చేస్తాడన్నమాట ఈయన!" అన్నాడు కిరణ్.

సాయిబాబా మౌనంగా వుండిపోయాడు.

"సాయిబాబాగారూ! మీరు హోటల్ కి సంబంధించినంతవరకూ స్టాఫర్స్‌ని, మెనేజిమెంట్ ని టేకిల్ చేయండి. నేను మిగతా విషయాలు చూసుకుంటాను. భీమానాయుడు చనిపోయేముందు రోజు తిరుపతినుండి వచ్చాడని మొక్కుబడి చెల్లించాడని తెలుస్తుంది, ఈ లెటరు ద్వారా."

"అయ్యయ్యో.... వెంకన్నబాబు దర్శనం చేసుకొచ్చి 'ఆత్మహత్య' చేసుకున్నాడా?" అన్నాడు సాయిబాబా బాధగా.

"నేను వస్తాను సాయిబాబాగారూ! మీరీ విషయంలో పూర్తి సమాచారం అందిస్తారు కదూ?" అన్నాడు ఇన్స్పెక్టర్ కిరణ్.

"అదేమిటండీ అలా మాట్లాడతారు. అభివృద్ధిలోకి రావలసినవారు. రేపు మీ అవసరం నాకుంటుంది. నా అవసరం మీకుంటుంది. మనం మనం ఒకరికొకరం చేయి చేయి కలిపి సాయపడకపోతే ఎలా?" అంటూ గలగలా నవ్వాడు.

ఇన్స్పెక్టర్ కిరణ్ హుందాగా నడిచాడు. సాయిబాబా కిరణ్ వెడుతున్నకేసి అలా చూస్తూ వుండిపోయాడు—

"ఆఫ్ట్రాల్ ఒక పోలీసు....కొండంత డిటెక్టివ్ ని

ములకనగా మూస్తాడు! సాయం చేయాలట సాయం! కాళ్ళ దగ్గరికొచ్చాడు—కాళ్ళ బేరలాడ్డానికి. ఏచోస్తు! డైరీలో క్లియర్ గావుంది. నాకు అప్పులున్నై తీర్చుకోలేక ఛస్తున్నాను, బాబోయ్! అంటే నమ్మడేమిటి? పైగా తిరుపతి వెళ్ళి వచ్చినవాడు అబద్ధం ఎందుకు రాస్తాడు? వీడికి గోవిందు రెడ్డి గారిమీద అనుమానం. వీడు ఎలాగో గోవిందు రెడ్డిని 'లాకప్'లో వుంచుతాడు.

ఇది హత్యకాదు, 'ఆత్మహత్య'ని నిముషాలమీద తేల్చి, గోవిందు గార్ని అనవసరంగా లాకప్‌లో వుంచినందుకు పరువు నష్టం దావా వేయించి, ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తేనే గాని నా పేరు సత్య సాయిబాబా కాదు!" శపథం చేశాడు.

"ఏమిటి స్సార్! మీలో మీరే మాట్లాడేసుకుంటున్నారు?" జ్ఞానానందం శిష్యపరమాణువు అడిగాడు.

"మాట్లాడుకోవడం కాదురా! గుండె మంట. వీడు నాపాలిట మృత్యువులా దాపురించాడు. వీడు వచ్చిం తర్వాత నాకు ఒక కేసూ రాలేదు. ఆ సంగతి నీకు తెలుసుకదా. కారులో పెట్రోలుందా?" అన్నాడు సడన్‌గా గుర్తుకు తెచ్చుకొని.

"ఎందుకు సర్?" అన్నాడు శిష్యుడు.

"ఎందుకేటి—నన్ను తగలబెట్టుకోడానికి — సాక్షి గ్రామం పోవాలోయ్. ఒక కేసు తగిలింది. గోవిందు రెడ్డిగారు నామీద నమ్మకం కొద్దీ వెయ్యిరూపాయలు అడ్వాన్సు ఇచ్చాడు. ఇదుగో వంద పెట్రోలు ప్లస్ నా ఖర్చులుకి. తొమ్మిది వందలు అమ్మగారికి తగలబెట్టు— మనం వెడుతున్నాం!" అన్నాడు దర్జాగా!

"నేనూ రావాలా సార్!"

"సువ్వెందుకోయ్ పీనుగా! పో. చావు—" అంటూ హుషారుగా బయటికి నడిచి హెరాల్డులో కూర్చొని, కారు స్టార్టుచేశాడు. చాలా సేపు మొండికేసి సాయిబాబా అవస్థ చూడలేక కదిలింది హెరాల్డ్ సాలిగ్రామం కేసి.

సాయిబాబా మెదడు ఆలోచనల కేసి పరుగు తీస్తున్నాయ్!

5

"మిస్ లీలారావ్ యిల్లు ఇదేనా?" అన్నాడు సాయిబాబా అడ్రసు సరిజూసుకొని. లోపల్నుంచి తెల్ల లంగా, తెల్ల కోక తెల్ల జాకెట్ మల్లెపూలతో ఒకామె వచ్చింది. "ఎవరు కావాలండీ మీకు?" అనడిగింది.

"మిస్..లీలారావ్. రిసెప్షనిస్టు హోటల్ హెవెన్" అన్నాడు సాయిబాబా.

"నేనే — ఏం కావాలి మీకు?" అంది కుర్చీ చూపిస్తూ.

సాయిబాబా కూర్చున్నాడు. సిగరెట్ ముట్టించాడు. పొగ రింగులు రింగులుగా వదలాలని ప్రయత్నించి ఫెయిలయిపోయాడు.

"నేను బయటికి వెళ్ళాలి. నాకు వేరే ఎంగేజ్ మెంట్ వుంది!" అంది టైమ్ చూసుకొని మిస్ లీలారావ్.

"యెక్కడికెడుతున్నారు?" అన్నాడు.

"ఏం మీరు వస్తారా! విషయం చెప్పండి. డోంట్ వేస్టుది టైమ్!" అంది సీరియస్ గా మొహం పెట్టి.

సాయిబాబా షాక్ తిన్నాడు. తను పరిశోధకుడుగా పాతికేళ్ళ అనుభవాన్ని నింపుకున్నాడు. ఎన్నో కేసులు గెలిచినా, ఓడిపోయినా, చవిచూశాడు. లీలారావ్ లాంటి కేసు తగల్లేదు. మాటకు మాట సమాధానం చెప్పడం.

ఎటో చూస్తూ చెప్పింది. పైగా టెమ్ వేస్టు అంటుంది.

"అమ్మాయ్! నేను ప్రఖ్యాత డిటెక్టివ్ సాయి బాబాని. నన్ను తెలుసా?" అన్నాడు పొగవదులుతూ.

"తెలీదండీ!"

ఖంగుతిన్నాడు.

"నువ్వు పనిచేస్తున్న హోటల్లో ఫైవ్ జీరో ఫోర్‌లో భీమారాయుడు చనిపోయాడు. అది హత్యో, ఆత్మ హత్యో నీకు తెలుసా?" అన్నాడు సీరియస్‌గా.

"నేను డిటెక్టివ్‌ని కాదండీ!"

మళ్ళీ ఖంగుతిన్నాడు. సర్దుకొంటూ "ఐ మీన్ నీకు భీమారావు గురించి తెలుసా?" అన్నాడు.

మాటిమాటికి నువ్వు, నువ్వు అంటుంటే మిస్ లీలా రావ్‌కి వళ్ళు మండింది. పోనీ తండ్రిలాంటివాడు—పరధ్యానంగా మాట్లాడుతున్నాడు కదాని ఒకటి రెండుసార్లు ఊరుకుంది. ఇక సహించలేకపోయింది.

"ప్లీజ్....గివ్ రెస్పెక్టు అండ్ టేక్ రెస్పెక్టు!" అంది సీరియస్‌గా.

తడబడ్డాడు సాయిబాబా.

"ఇదేమిటి—నేను ప్రఖ్యాత డిటెక్టివ్‌నని చెప్పినా ఇంత చీప్‌గా మాట్లాడుతుందేమిటి?" బయట అనలేక లోపలే అనుకున్నాడు.

"మీకు కావల్సిన ఇన్‌ఫర్మేషను ఏమిటో అడగండి. అయిదు నిముషాల్లో ముగించేద్దాం. అవసరమనుకుంటే తర్వాత కలుద్దాం. ప్లీజ్ ... మరోలా అనుకోకండి. నాకు వేరే ఎంగేజ్‌మెంట్ వుంది—" అంది లీలారావ్ సభ్యతగా చెబుతూ.

తన జీవితకాలంలో ఒకర్ని ప్రశ్నలువేయడం—వారు

సమాధానం చెప్పలేక తలదించుకోవడంలాంటివి ఎన్నో జరిగేయి గాని—ప్రశ్నలడగండి అని ఎదిరించి అడగడం తను తలదించుకోవడం ఇదే ఫస్టు టైమ్.

"ఏవయినా నువు చాలా తెలివయినదానివమ్మా!" అన్నాడు మెచ్చుకుంటూ సాయిబాబా.

"ఇది ప్రశ్న కాదనుకుంటాను!"

"బయటికెళ్ళి మీరు యెంతసేపట్లో వస్తారు?" సాయిబాబా టైమ్ చూసుకుంటూ అడిగాడు.

"ఇదేనా మీరడగవలసిన ప్రశ్న?" అంది.

తడబడ్డాడు.

"ఇదికాదు. చాలా వున్నై. అయితే నేను బిజీగా అడగవలసినవి....నువు....సారీ మీరు....గజిబిజీగా చెప్ప వలసినవీ కావు. పర్సనల్ గా—సాధ్యమైనంత టైమ్ తీసుకొని అడగాలి. మీ....మీరు చెప్పాలి!" అన్నాడు మొహాం మూడో అంకెలా పెట్టి.

"సరే మిమ్మల్ని కలవమంటూరా! నన్ను కలుస్తారా?" అడిగింది ధైర్యంగా.

"వయసయిపోయింది కదమ్మా....నువ్వే .... మీరే కలిస్తే బావుంటుంది!" అన్నాడు విజిటింగ్ కార్డు అందిస్తూ.

"థాంక్యూ—ఐ షల్ మీట్ యూ!" అంటూ బయటికి నడిచింది.

"మీ కభ్యంతరం లేకపోతే....మీరు యెక్కడికి వెడతారో చెప్తే డ్రాప్ చేస్తాను!" అన్నాడు సన్నగా నవ్వుతూ.

"నో థాంక్యూ మీతోబాటు మీ కారుకీ శ్రమ

పెట్టడం నాకిష్టంలేదు!" అంటూ విసురుగా వెళ్ళిపోయింది.

6

"హాపీ బర్త్ డే టుయూ!" అంటూ అందరూ పాడుతున్నారు. ఇన్స్‌పెక్టర్ కిరణ్ ఇన్వైటర్స్ అందర్నీ పరిశీలనగా చూడసాగాడు. అందరూ ఆనందంగా పాట మీద దృష్టి నిలిపి బ్లెస్సింగ్స్ యిస్తున్నారు. కిరణ్ చూపు ఒకచోట ఆగింది—

ఎర్రటి పట్టుచీర, ఎర్రటి ముద్ద మందారంలాంటి జాకెట్, ఎర్రరాళ్ళ లాకెట్, మొత్తం యెరుపు. ఆకాశంలో సంధ్యలాగా ఒక అందమైన యువతి ఆమె.

కిరణ్ ఆమె దగ్గరకు వెళ్ళాడు.పరిశీలనగా చూసాడు.

"మే ఐ నో యువర్ స్వీట్ నేమ్ ప్లీజ్!" అనడిగాడు.

"ష్యూర్—మై నేమ్ ఈజ్ సంధ్య" అంది కిరణ్ ఆలోచనకి అతికినట్టు.

"ఫెంటాస్టిక్!" అన్నాడు ఆమె అందానికి తగ్గట్టు పేరున్నందుకు మరోసారి చూపులతోనే అభినందించి

"ఐయామ్ మిస్టర్ కిరణ్—యు మే నో మై ప్రొఫెషన్!" అంటూ తన శ్రీమతి జ్యోతి వంక చూశాడు. జ్యోతి నవ్వుతూ పలకరించింది.

"మిస్ లీలారావ్ ఇంకా రాలేదా?" అంది సంధ్య.

కిరణ్ ఆలోచనలోపడ్డాడు.

"ఆమె వస్తానని మీతో చెప్పేరా?"

"అవునండి—ఆమె మిమ్మల్ని కలుస్తానంది. మీ పాప లక్ష్మికి బర్త్ డే అని కూడా ఆమే చెప్పింది!" అంది సంధ్య ముద్దుగా.

సంధ్యను అందరూ వింతగా చూడసాగారు. సంధ్య క్రొత్త హీరోయిన్. ఇప్పుడిప్పుడే ప్రముఖ సంస్థ లన్నిటి లోనూ నటిస్తోంది. 'జ్యోతి' అందరికీ స్వీట్స్, డ్రింక్స్ ఆఫర్ చేయడంలోని నిమగ్నమైంది.

"సాకీ ఫర్ ది లేట్!" అంటూ మిస్ లీలారావ్ ఫ్లవర్ బుకే తీసుకొని వచ్చింది—కిరణ్ లీలారావ్ మొహంలోకి కాస్సేపు తీక్షణంగా చూశాడు. లీలారావ్ చలించ లేదు. చిరునవ్వుతో ఆ చూపుల్ని రిసీవ్ చేసుకుంది.

"విష్ యు మెనీ మెనీ హాపీ రిటెన్స్ ఆఫ్ ది డే!" అంటూ బుకే అందించి ఓ గోల్డు రింగు పాప చేతికి తొడి గింది.

సంధ్య కూడా ఓ గోల్డు చెయిన్ తీసి పాప మెళ్ళో వుంచబోయింది.

"నో మేడమ్—థాంక్యూ వెరీ మచ్!" అంటూ ఛెయిన్ తిరిగి ఇచ్చేశాడు. రింగు కూడా తీసి మిస్ లీలారావ్ చేతిలో వుంచాడు.

"మీనుండి బహుమతులను తీసుకొనే అదృష్టం ఈ జన్మకు నాకు ఉండదనుకుంటాను. బికాజ్ ఐయామ్ ఎ పోలీసాఫీసర్!" అన్నాడు సిన్సియర్ గా.

భారంగా నిట్టూర్చారు ఇద్దరూ.

"మీకు ఇవ్వడం లేదండీ—పాపకి స్తున్నాం దీన్ని. వద్దనే అధికారం మీకు లేదు. ఇది మా ప్రేమకు చిహ్నం" అంది లీలారావ్. సంధ్య ఆ మాటల్ని సపోర్టు చేస్తున్నట్లు తలూపింది.

"సో సారీ..రండి. టెర్రస్ మీద మాట్లాడుకుందాం!" అంటూ టెర్రస్ మీదకి దారితీశాడు.

టెర్రస్ మీద అందమైన మల్లెపందిర వుంది. చల్లటి

గాలికి మత్తెక్కించే 'ఘుమ-ఘుమ' సువాసనలు వేద జల్లుతున్నై మల్లెలు.

లీలారావ్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌ని చూస్తోంది. డ్రస్సులో చూసిందానికి మఫ్టీలో చూసిందానికి ఎంతో తేడా వుంది.

కిరణ్ చాలా అందగాడు. సమ్మోహితుల్ని చేసే అందగాడు. చూపులు చాలా షార్ప్‌గా వుంటాయి. ఆయన ప్రతి కదలికకీ ఏదో ఒక అర్థం వుంటుంది. కిరణ్‌కి తగ్గ భార్యకాదు జ్యోతి—పాత చింతకాయ పచ్చడిలా వుంది. అందంగానైనా లేదు. అంతే మరి. అది సృష్టిలో వింత! అనుకొంటూ నిట్టూర్చింది.

"చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్ — దేన్ని గురించి?" అనడిగాడు కిరణ్ టీ ఆఫర్ చేస్తూ.

సంధ్య టీ 'సిప్' చేస్తూ "ఈ వాతావరణం లీలకి బాగా నచ్చివుంటుంది!" అంది.

"నో....నో....ఇంకేదో థింక్ చేస్తూ వుండొచ్చు. మా పాపకి బర్త్‌డే అని మీకెలా తెలుసు?" లీలారావ్‌ని అడిగాడు.

"మీ రాజాగారు చెప్పేరు—"

"ఎప్పుడు?"

"రెండు గంటల క్రితం మీ కోసం ఆఫీసుకు ఫోన్ చేశాను. సబ్ఇన్‌స్పెక్టర్ రాజా స్పీకింగ్ అన్నారు. వివరాలడిగాను. చెప్పేరు—" అంది కుల్పంగా.

"మరి ఫంక్షన్‌కు ఎర్లీగా రావొచ్చు కదా!"

"రావొచ్చు—రావాలనే బయలుదేరాను. డిటెక్టివ్ ఎదురయ్యారు. నాకొన్ని అనుమానాలున్నాయి— అడుగుతాను అమ్మాయీ! అన్నారు. అడుగు నాన్నా

అన్నాను. అంతే — కంగారుపడిపోయి ప్రోగ్రాం పోస్టుపోన్ చేసుకున్నారు. మరీ ఫిలిం జర్నలిస్టుల్లాగా తయారయ్యారు డిటెక్టివ్‌లు" అంటూ పకలబడి నవ్వింది. ఆమె నవ్వుతుంటే ఆమె ఎదమీద అందమైన విరుఫులు కనిపించాయి. మల్లెపందిరి కదులుతున్నట్లనిపించింది కిరణ్‌కి.

"అన్నట్లు సంధ్యగారి గురించి సంక్షిప్తంగా చెప్పాలి. వీరు భీమానాయుడుగారి పిక్చర్‌లో, ఫస్ట్ టైమ్ యాక్ట్ చేశారు. మంచి పేరొచ్చింది. సెకండ్ పిక్చర్‌లోను వీరే డబుల్ వెర్షన్స్ బోత్ తెలుగు అండ్ టమిల్‌లో యాక్ట్ చేశారు హీరోయిన్‌గా. బాగా పోయింది. హండ్రెడ్ డేస్ అయ్యింది కదూ!" సంధ్య కేసి చూస్తూ అడిగింది లీలారావ్.

సంధ్య అవునన్నట్లు తలూపింది.

"సంధ్య నాకు బెస్టు ఫ్రెండ్. బైదిబై — భీమానాయుడుగారంటే ఆమెకు అమితమైన ప్రేమ. ప్రేమా ఇన్ ది సెన్స్ భక్తి, గౌరవం. అసలు ఆత్మహత్య చేసుకున్నారంటే నమ్మటంలేదు. చెప్పు సంధ్యా!" అంటూ సంధ్యను కదిలించింది లీలారావ్.

"అవునండీ. నాకు ఆయనే లైఫ్ ఇచ్చారు. ఆయన నన్ను ఇంట్రడ్యూస్ చేసివుండకపోతే ఈ రోజు నేనీ సిటిలో వుండేదాన్ని కాను. ఆయన సడన్‌గా చనిపోవడం రియల్లీ ఇట్స్ లాస్ టు మీ!" అంది కళ్ళల్లో తిరుగుతున్న నీరు తుడుచుకుంటూ. ఈమాటలు చెబుతున్నప్పుడు సంధ్య మొహం ఎర్రగా కందగడ్డలా కందిపోయింది—

"సార్ మీకోసం ఫోను!" అంటూ బాయ్ పిలిచాడు

కిరణ్ ని—కిరణ్ ఆఫీసు రూమ్‌కు పరుగులాంటి నడకతో వెళ్ళాడు.

“యస్ స్పీకింగ్!” అంటూ రిసీవర్ ఎత్తాడు.

“సార్ సార్.... నేను రాజుని మాట్లాడుతున్నా. భీమానాయుడుగారు చనిపోయే రోజునే అయిదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్‌నుండి డ్రాప్ చేశారట సర్!”

“అవును తెలుసు!”

“తెలుసా సర్!” రాజు కాస్సేపు మాట్లాడలేక పోయాడు.

“ఆ రోజే తెలుసు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో నుండి మరో లక్షరూపాయలు డ్రా చేసినట్లు తెలుసు. అంతకు రెండ్రోజులు ముందు తను తీయబోయే పిక్చరుకి అడ్వాన్సుగా సీడెడ్, నైజాం డిస్ట్రిబ్యూటర్ల దగ్గర్నుండి మరో మూడు లక్షలు తీసుకున్నాడని తెలుసు. అందుకే మనం ఇంత సీరియస్‌గా ఇన్వెస్టిగేట్ చేయవలసిన పరిస్థితి. భీమానాయుడు ఆత్మహత్య చేసుకోలేదు. ఎవరో హత్య చేశారు. హత్య చేసినవారు దొరికితే డబ్బు వారి దగ్గరే వుంటుంది—”

“ఈ విషయాలన్నీ మీకు ముందే తెలుసా సర్!” ఆశ్చర్యంగా అడిగాడు.

“ఈ కేసు విషయంలో ఇంకా చాలా విషయాలు తెలుసు. యెవరికీ తెలియనివి మనం సేకరించడమే ఇన్వెస్టిగేషనంటే—నువ్వు వెంటనే బయలుదేరు! హోటల్ దగ్గరుండు. డిటెక్టివ్ సాయిబాబా వుంటాడు. ఈ పరిశోధన డిస్టర్బ్ కాకుండా ఆయన సహాయం కోరినట్లు నాటకం ఆడాను. ఆయన్ను ఫాలో అవ్వు! రూమ్ తాళాలు మాత్రం తీయనీయొద్దు. గోవిందరెడ్డిని మాత్రం

యెక్కడికీ కదల్నియొద్దు.... లేబరేటరీ దగ్గర మన త్రీ జీరో సిక్స్‌నీ, టు జీరో సెవన్నీ మరో ఇద్దరు కానిస్టేబుల్స్‌నీ వుంచు! కేసు అండర్ ఇన్వెస్టిగేషన్ అని కలెక్టరేట్ కీ, డి.ఐ.జి.గారికీ ఇన్‌ఫామ్ చేయి. పోస్టుమార్టమ్‌కి మరో కొన్ని గంటల్లో డెడ్ బాడీని ఎలవ్ చేస్తామని డి.ఎమ్.ఓకి ఫోన్ చెయ్యి. మిస్టర్ రాజూ మైడియర్! హర్రియప్!" అంటూ ఫోను పెట్టేశాడు.

టెర్రస్ మీద లీలారావ్, సంధ్య మౌనంగా కూర్చున్నారు ఏం మాట్లాడుకోకుండా. "సాకి బోరు కొట్టించానా!" అంటూ స్వీట్ నోట్లో పెట్టుకున్నాడు.

"లీలారావ్ గారూ! ఆ రోజు మేఘస్తు భీమారావుగారు మీ హోటల్లో దిగినప్పుడు చేతిలో బ్రీఫ్‌కేసు వుందా?"

"వుంది!" అంది లీలారావ్.

"బ్రౌన్ కలర్ అరిస్టోక్రాట్."

"యు గాట్ వెరిగుడ్ రిమెంబరెన్స్" కాంప్లిమెంట్స్ చెప్పేడు.

"ఇట్స్ డ్యూటీ!" అంది చిరునవ్వుతో.

"సంధ్యగారూ మీరు మాట్లాడండి!" కదిలేశాడు కిరణ్.

"మీరు చెప్పండి యేదయినా—" అంతవరకూ మౌనంగా వుండి. ఇబ్బందిగా అంది.

"కిరణ్ గారూ! లెట్స్ డు వన్ థింగ్ — సంధ్య ఇంటికి వెడదాం. అక్కడ మీకు కావలసిన ఇన్ఫర్మేషను అంది స్తుంది. డోంట్ వర్రీ. సంధ్య ఈజ్ మై బెస్టు ఫ్రెండ్!" అంది లేచి నిలబడి—కిరణ్ ఫాలో అయ్యాడు.

సంధ్య చిరునవ్వుతో వెల్‌కమ్ చెప్పింది ఇష్టంలేక పోయినా—

7

"ఇది చాలా ఘోరం మిస్టర్ రాజూ! మనిషి ఆత్మ హత్య చేసుకొని ఇది రెండవరోజు—లేబ్‌లో శవాన్ని వుంచి దాన్ని కనీసం పోస్టుమార్టమ్ కూడా చేయనీయకుండా, ఈ హోటల్‌లో రూమ్ తెరిపించకుండా, లక్షలకు విలువచేసే హోటల్ బిజినెస్ పాడుచేసి-మీరు, మీ ఇన్స్‌పెక్టర్ గారు హయ్యర్ అథారిటీస్ పెర్మిషను లేకుండా మీ ఇష్టంవచ్చినట్లు మీరు ప్రవర్తించడం నేరం! ఇలాంటి సమయంలో—మాబోటి అనుభవజ్ఞులు కల్పించుకొని ఏదో పరిష్కారం చెయ్యకపోతే అక్కడ లేబ్ కుళ్ళు కంపు కొడద్ది. ఇక్కడ బిజినెస్ ఆగిపోయి, గోవిందురెడ్డి గుండాగిపోయి బలవంతంగా చస్తాడు—ఇది మరో హత్య అవుతుంది. ఈ కేసులో మీరు, నేను అందరం ఇరుక్కుంటాం. సో— జరగవలసిన కార్య క్రమాలు జరిపించండి!" అన్నాడు సాయిబాబా పెద్దరికం వొలకబోస్తూ.

"చాలా థాంక్సండీ!" అంటూ చేతులు పట్టుకున్నాడు గోవిందురెడ్డి అవ్వే కాళ్లు అనుకోమన్నట్లు చూస్తూ.

"ఇదిగో రెడ్డిగారూ! మీరు కంగారుపడకండి-భీమానాయుడు చనిపోతూ....పోతూ ఓ పుణ్యం కట్టుకొని పోయారు-ఆయనకి అప్పులున్నాయని-అవి తీర్చలేక చస్తున్నానని-రాసి మరీ పోయాడు. ఇందులో పరిశోధనచేసి కనిపెట్టవలసింది ఏంలేదు. అతగాడు చనిపోయినపుడు పాకెట్‌లో లక్షలున్నాయా? ముష్టి పదివేలున్నాయి.

దీనికింత కంగారు, కన్ఫ్యూజన్, హడావుడి పడవలసిన అవసరంలేదు. ఇదుగో రెడ్డిగారు ఇన్ని....ఇన్ని కేసులు చూశాను ఇలాంటివి" అంటూ సెరిసిన వేం(టుకల్ని పాయగా తీస్తూ చూపించాడు.

"రాజుగారూ! మీకు ఫోను!" అంటూ రిసెప్షనిస్టు ఫోను అందించాడు.

"అదిగో డి.ఐ.జిగారి దగ్గర్నుండయ్యుంటుంది. నేను చెప్పలేదుటయ్యా .... ఇలాంటి కేసులు పెండింగ్‌లో వుంచకూడదని-" అన్నాడు సాయిబాబా.

"నమస్తే సార్! నేను రాజుని .... ఎక్కడ్నుంచి సార్....ఓహో అలాగే సర్!...." అంటూ ఫోను పెట్టేశాడు రాజు.

సాయిబాబా, రాజు మొహంలోకి చూసి నవ్వుకున్నాడు లోలోపల.

"గోవిందురెడ్డిగారూ! మీ హోటల్ బార్బర్ యెవరు?"

యెందు కడుగుతున్నాడో అర్థంకాలేదు గోవిందు రెడ్డికి.

రిసెప్షనిస్టు చెప్పింది "నటరాజన్!" అని.

"ఆయనకి వయసెంతుంటుంది?"

"జస్టు ఇరవై మూడు....ఇరవై నాలుగుండొచ్చు!"

"ఏం చేస్తుంటాడు ఇక్కడ?"

"హెయిర్ డ్రెస్సింగ్!"

"ఏదైనా పార్టుటైమ్ జాబ్ చేస్తుంటాడా?"

"సినిమాల్లో హెయిర్ డ్రెస్సింగ్ చేస్తుంటాడు!"

"యెవరికి?"

"తెలీదు!" అడిగిందానికి టకటకమంటూ సమాధానం

చెప్పింది రిసెప్షనిస్టు సరోజ.

"ఆయన్ని పిలిపించండి!" అన్నాడు. రిసెప్షనిస్టు సెలూన్‌కి డయల్ చేసింది. రెస్పాన్స్ రాలేదు. యెంక్వయిరీకి డయల్ చేసింది.

"హలో.... నేను రిసెప్షనిస్టు సరోజ మాట్లాడుతున్నా నటరాజన్ వచ్చాడా?"

"రాలేదు!" అట్నుంచి రిప్లై.

"ఉదయం వచ్చాడా?"

"రాలేదు!"

"నిన్న వచ్చాడా?"

"వచ్చాడు."

"యెంతవరకూ వున్నాడు?"

"ఏమో-నైటు చాలాసేపు వున్నాడు."

వెంటనే కిరణ్ తనకి ఇచ్చిన నెంబరుకి డయల్ చేసి హెయిర్ డ్రెస్సర్ నటరాజన్ గురించి ఇన్‌ఫర్మేషన్ అందించాడు.

"ఏం బాబూ! ఏమంటూరు కిరణ్ గారు?" అర్థం కానట్లు అడిగాడు సాయిబాబా.

"ఇక్కడికే వస్తున్నారు!"

"ఇక్కడికే వస్తున్నారా!" అంటూ దిగాలు పడిపోయాడు గోవిందురెడ్డి - సాయిబాబా కళ్ళు గిర్రున తిరిగాయ్.

8

కిరణ్‌కి డ్రింక్ అందించింది మిస్ లీలారావ్.

"ఛీర్స్" అన్నారు ముగ్గురూ-

సంధ్య, మిస్ లీలారావ్, కిరణ్.

"ఛీర్స ఫర్ ది పీస్ ఆవ్ భీమానాయుడూ!"

అన్నాడు కిరణ్.

సంధ్య నవ్వింది, సిప్ చేసింది. కిరణ్ గొంతు మండు తున్నట్టుంది. కొంచెం ఇబ్బందిపడ్డాడు.

"ఈజ్ దిస్ ఫస్టు టైమ్?" అనడిగింది సంధ్య.

"ఆయనకి ఇలాంటి అనుభవం యిదే ఫస్టు టైమ్ అను కుంటాను!" అంది లీలారావ్. ఫస్టు రౌండ్ పూర్తయింది. కిరణ్ కొంచెం పట్టు తప్పాడు.

సెకండ్ రౌండ్ కూడా పూర్తయింది. కిరణ్ మాటలు స్లిప్ అవుతున్నై. థర్డురౌండ్ పూర్తికావచ్చింది. కిరణ్ కి మైకంవచ్చి పడిపోయాడు.

సంధ్య, లీలారావ్ రూమ్‌లోకి వచ్చారు. రూమ్‌లో వున్న పళంగా ఎ.సి. ఆఫ్ అయింది.

సంధ్యకి ఎ.సి. లేకపోతే చెమట్లు పోస్తుంది. అసలు తట్టుకోలేదు.

"కిరణ్ ఏం చేస్తున్నట్టు?" సంధ్య అడిగింది.

"మత్తుగా తాగాడు చిత్తుగా పడుకున్నాడు!" నవ్వింది లీలారావ్.

"లీలా! ఆయన్ని నిజంగా లోబరుచుకున్నా మంటావా?"

"ఓ.., య్యాస్ గా!"

"ఎలా చెప్పగలవు?"

"గురుడు అగ్గిలాంటి మనిషి. పచ్చి మంచినీళ్ళు తప్ప ద్రాక్షరసం ముట్టడు. రాయల్ సెల్యూట్ కొట్టేశాడు-ఆడదాని ఓరచూపులో-జగాన ఓడిపోని వీరుడెవ్వడు" అంటూ పాడింది లీలారావ్.

"లీలా! నువ్వు చాలా సాయం చేశావు?"

"నే నేం చేశాను!"

"కిరణ్‌ని బుట్టలో వేసుకున్నావ్. మనమంటే సింపతీ వుండేలా చేశావ్. గోవిందురెడ్డిమీద అనుమానం బలపడింది కదూ!"

"అవును. చంపింది గోవిందురెడ్డేకదా!" అంది లీలారావ్.

"ష్.... చంపింది — సంధ్య—" అంటూ నవ్వింది కైపుగా.

ఎ.సి. సడన్‌గా ఆన్ అయ్యింది. చల్లటిగాలి వస్తోంది. ప్రాణం కుదుటపడింది.

"సంధ్యా! భీమానాయుడుమీద నీకెందుకంత పగ!"

"లీలా.... నాయుడ్ని నమ్మాను. రెండు పిక్చర్లలో యాక్టు చేశాను. పైసా రెమ్యూనరేషను ఇవ్వలేదు. నన్ను అతను ఇష్టమొచ్చినపుడు మహాబలిపురం తీసుకెళ్ళేవాడు. తన సరదాలు తీర్చుకొనేవాడు. అవసరమయినపుడు నన్ను డిస్ట్రిబ్యూటర్స్ దగ్గరికి పంపించేవాడు. వెళ్ళపోతే చావబాదేవాడు. ఈ మధ్య క్రొత్తరకం వ్యాపారం మొదలుపెట్టాడు. నగ్నంగా డిఫరెంట్ యాంగిల్స్‌లో ఫోటోలు తీయడం — అవి ఫారిన్ డీలర్స్‌కి సేల్ చేయడం!"

"నీ నగ్న చిత్రాలు వాళ్ళకెందుకు!"

"పిచ్చి లీలా! నేకెడ్ నెగిటివ్స్ ఇపుడు వేలకువేలు. మంచివైతే లక్షలు కుమ్మరిస్తారు ఫారినర్స్. ఒక్కరోజు పైసా ఇచ్చిన పాపాన పోలేదు.... గత ఆరు మాసాలుగా నా మొహం చూడలేదు. నన్ను రిజిష్టర్ మేరేజ్ చేసుకుంటానన్నారు. ఆ ప్రయత్నం మరిచిపోయారు. కడుపు మండింది. నేను జీవితంలో యెప్పుడూ యెవరిదగ్గరా మోసపోలేదు. నాకు రావల్సింది నేను ఎలా పొందాలో

బాగా తెలుసు. అందుకే ఆ రోజు—"

జరిగినదంతా చెప్పేసింది సంధ్య.

కిరణ్ ఎదురుగా నిలుచున్నాడు. సంధ్య తృళ్ళిపడి లేచింది.

"సంధ్యగారూ మనం వెడదాం పదండి!" అన్నాడు నవ్వుతూ.

"యెక్కడికి?"

"హోటల్ హెవెన్‌కి."

"ఎందుకు?"

"చెప్తాగా. ముందు 'నటరాజన్'ని యెక్కడ దాచిపెట్టారో చెప్పండి. మీతోబాటు ఆయన్ను కూడా తీసుకురండి!"

సంధ్యకు కంపనం బయలుదేరింది.

"లీలా వాటీజ్ దిస్!"

"డిసీజ్ మిస్టరీ—సంధ్యా! నటరాజన్‌ని పిలువ్—తప్పదు. భీమానాయుడ్ని హత్య చేశానని నువ్వే చెప్పావుగా!" అంది లీలారావ్.

"యూ.... యూ.... డెవిల్" అంటూ లీలారావ్ గొంతు నులిమేయబోయింది.

"షటప్—డు ఏజ్ ఐ సే!" అంది లీలారావ్ సీరియస్‌గా.

సంధ్య దగ్గరోవున్న స్విచ్‌ని నొక్కింది—రెడ్ బల్బ్ వెలిగింది.

రామచిలక కిచకిచమంటూ శబ్దం చేస్తోంది. ఎవరూ రాలేదు.

"యెవరూ రారు మిస్ సంధ్యా! మీ వాళ్ళంతా

జీపుల్లో వున్నారు. క్విక్ నటరాజన్‌ని పిలువ్!" అని అరిచాడు.

"సార్! నటరాజన్ శవం స్టోర్ రూంలో వుంది!" అన్నాడు హెడ్ కానిస్టేబుల్ నీలకంఠం పరుగెత్తుకుంటూ వచ్చి.

"నేను భీమానాయుడ్ని చంపలేదు. నాకూ భీమా నాయుడికీ ఏ సంబంధంలేదు—" అంటూ అరిచింది.

క్రిందికి ఈడ్చుకెళ్ళింది లీలారావ్. కిరణ్ ఫాలో అయ్యాడు, రివాల్వర్ సిద్ధంగా వుంచుకొని—జీపులో సంధ్య, లీలారావ్, కిరణ్ కూర్చున్నారు. జీపు హోటల్ హెవెన్ కేసి బయలుదేరింది.

వెనుక మరో వేన్ నిండా పోలీసులు ఫాలో అయ్యారు—నటరాజన్ శవంతో—

నీలకంఠం, రాములింగం తదితర సీనియర్స్ అంతా సంధ్యాదేవి ఇల్లు సోదా చేయడంలో నిమగ్నమయ్యారు.

9

"నో .... నో .... నాకేం తెలీదు డి.ఐ.జి.గారూ!" అంటూ అరిచింది సంధ్య.

కిరణ్ వచ్చేసరికి హోటల్ హెవెన్‌కు హయ్యర్ అథారిటీస్ అందరూ వచ్చారు. డి. ఐ. జి. భాస్కర్ రావుగారు. డి.ఎమ్.ఒ. వరదరాజన్ గారు. ఆర్.డి.ఓ పుష్పదల్ గారు, భీమానాయుడు భార్యా పిల్లలు, భీమా నాయుడు పార్టనర్స్, ఫైనాన్సియర్స్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏజెంట్, ఇన్సూరెన్స్ హయ్యర్ అథారిటీస్ సీడెడ్ నైజాం డిస్ట్రిబ్యూటర్స్ అందరూ అక్కడే ముకాం చేశారు.

రాజు చాకచక్యంగా పనిచేసి ఇంతమందిని సమావేశ

పరిచినందుకు ఒక్క క్షణం కృతజ్ఞతగా చూశాడు కిరణ్.

సాయిబాబా మొహంలో నెత్తురుచుక్క లేదు. అలాగే వున్నాడు గోవిందురెడ్డి కూడా. హోటల్ స్టాఫ్ అంతా వింతగా చూస్తున్నారు.

హెయిర్ డ్రెస్సర్ నటరాజన్ శవాన్ని, భీమా నాయుడు శవాన్ని ప్రక్క ప్రక్కగా పెట్టారు.

"సార్! ఈ కేసు పరిశీలనపట్ల చిరంజీవి కిరణ్ తొందరపాటు చూపించాడేమోనని నా అనుమానం. ఇంతవరకూ ఈ హోటల్ ప్రొప్రయిటర్ నా బెస్టు ఫ్రెండు గోవిందురెడ్డి మీద అనుమానం చూపించాడు. సడన్‌గా ఆ అనుమానం, మద్రాసుకు రావలసిన ఉప్పెన దివి సీమకు కొట్టుకు పోయినట్లుగా సంధ్యాదేవి కేసి మళ్ళింది.

ఇందులో పెద్దగా ఆలోచించవలసిందేం లేదు. భీమా నాయుడు క్లియర్‌గా రాశారు. ఆస్తి నాలుగు లక్షలు. అప్పులు పదహారు లక్షలని. యెక్కడయినా మనకి వెయ్యిరూపాయలు అప్పుంటేనే నిద్రపట్టదు. ఆ మహాను భావుడికి పదహారు లక్షల రూపాయలు అప్పులున్నా యంటే మాటలా! అందువలన ఆయనకి నిద్రపట్టక నిద్ర మాత్ర లేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు.

ఇప్పుడయినా మించిపోయిందేమీ లేదు. ఈ కేసు విచారణ జరపవలసిన సరైన సమయం ఇదే. పెద్దవా ళ్ళున్నారు. ఆయన భార్యగారున్నారు. ఆయన పిల్ల లున్నారు. ఆ శవాన్ని పోస్టుమార్టమ్ జరిపించి, మిగతా కార్యక్రమాలు పూర్తిచేస్తే చనిపోయిన ఆయన ఆత్మకు శాంతి!" అంటూ ఉపన్యాసం ముగించాడు సాయిబాబా.

అందరి దృష్టి కిరణ్ మీద నే వుంది.

కిరణ్ కి మంచి పేరుంది. తను హాండిల్ చేసిన ఏ కేసు ఫెయిలవ్వలేదు. డి. జి. ఐ. సీరియస్ గా చూశాడు కిరణ్ కేసి.

"థాంక్స్యూ వెరీ మచ్ మిస్టర్ సాయిబాబా గారూ! మీరు ప్రఖ్యాత డిటెక్టివ్ లు. మీ అనుభవంతో ఇచ్చిన ఉపన్యాసానికి జోహార్లు. మరి హోటల్ హెవెన్ సెలూన్ హెయిర్ డ్రెస్సర్ నటరాజన్ శవం మాటేమిటి! నటరాజన్ శవంకీ, సినీ నటి సంధ్య స్టోర్ రూమ్ కీ ఏమిటి సంబంధం? దీనికి మీ సంజాయిషీ" అని నిల దీశాడు కిరణ్.

సాయిబాబా నోరు పెగల్లేదు.

ఇంతలో హెడ్ కానిస్టేబుల్ నీలకంఠం, రామలింగం తదితరులు జీపులో వచ్చారు. కొన్ని డెయిరీలు, ఒక బ్రౌను బ్రీఫ్ కేసు తీసుకువచ్చి అందరిముందు వుంచారు.

మిస్ నీలారావ్ కళ్ళు మెరిశాయి. ఆ రోజు తను చూసిన బ్రీఫ్ కేసు అదే. ఆ విషయమే గట్టిగా చెప్పింది.

"డియర్ జంటిల్ మెన్! మే ఫస్టు నైట్ న—ఈ హోటల్ హెవెన్ రూమ్ నెంబర్ ఫైవ్ జీరో ఫోర్ లో భీమానాయుడు రూమ్ తీసుకొన్నాడు. ఈ డెయిరీలో రాసినట్లు—ఆ రోజు తిరుపతి వెళ్ళలేదు. సప్తగిరి ఎక్స్ ప్రెస్ లో తిరిగిరాలేదు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ లో లక్ష రూపాయలు డ్రా చేసినట్లుగా ఏజెంట్ మిస్టర్ ముత్తురామన్ గారు సాక్ష్యం. యామై ఒ.కే. మిస్టర్ ముత్తూజీ!" అని గంభీరంగా అడిగాడు కిరణ్. హోటలంతా పిన్ డ్రాప్ సైలెంట్ గా వుంది.

"ఓ.కే! అన్నాడు ముత్తురామన్.

"నెక్స్‌లెట్ ఇన్సూరెన్స్‌లో తనకు రావలసిన ఫైవ్ లాక్స్‌కి గత రెండు మూడు నెలలుగా లావాదేవీలు జరగడం, డాక్యుమెంట్స్, రిసీట్స్ సరిగ్గా లేకపోవడం వలన ఇంతవరకూ పోస్టుపోన్ చేయడం జరిగింది. అదే రోజున ఫైలాక్స్ కాష్ డ్రా చేశారు. దీనికి సాక్ష్యం అదిగో ఇన్సూరెన్స్ హయ్యర్ అథారిటీస్ మిస్టర్ బలరామన్, మిస్టర్ సుకుమారన్ గార్లు. ఏమైమై కరెక్టు?" అంటూ ప్రశ్నించాడు కిరణ్.

"పెర్‌ఫెక్ట్లీ కరెక్టు సర్!" అన్నారు ఇద్దరూ.

"అంతకుముందు, రెండ్రోజుల క్రితం సాయంత్రం సీడెడ్ నైజాం ఏరియా బిజినెస్ కోసం త్రీ లాక్స్ ఇచ్చివెళ్లారు. డా॥ నాయుడుగారు, శ్రీ రాఘవరావుగారు, ఏమండీ ఇచ్చారా లేదా?"

"ఇచ్చాం సార్! ఇచ్చినట్లు మా దగ్గర రశీదులు, అగ్రిమెంట్స్ వున్నాయి!" అన్నాడు నాయుడు తమ డబ్బు పోతుందన్న భయంతో....

"గత ఆరు మాసాలుగా మిస్ సంధ్యాదేవిగారికి, ప్రొడ్యూసరు భీమానాయుడుగారికి కనెక్షన్స్ లేవు— కేవలం డబ్బు సంపాదన ముఖ్యమనుకున్నారు ఇద్దరూ. సంధ్య వేషాలు వేసి సంపాదించింది. భీమానాయుడుగారు మరోవిధంగా అమ్మాయిల నగ్నచిత్రాల్ని తీసి— నెగిటివ్స్ సేల్ చేసి డబ్బు సంపాదించడం మొదలుపెట్టారు.

హెయిర్ డ్రెస్సర్ నటరాజన్‌కీ సంధ్యకీ పరిచయముంది. ఒక తమిళ చిత్రానికి ఈయన్ని పర్సనల్ హెయిర్ డ్రెస్సర్‌గా వుంచుకుంది. ఈ హోటల్‌కే భీమానాయుడు వస్తాడని, హోటల్‌కి రాగానే 'నటరాజన్' ద్వారా మాలిష్ చేయించుకుంటాడని సంధ్యకు తెలుసు. తన

ప్లాన్ ప్రకారం - సంధ్యకు మెసేజ్ అందించాడు నటరాజన్. సంధ్య ఆరోజు మారువేషంలో ముస్లిం అమ్మాయిలాగా వచ్చింది. దానికి మిస్ లీలారావ్ సాక్ష్యం!

సంధ్య అందంగా ఎలా నటించగలదో. అందంగా అలాగే రాయగలదు. భీమానాయుడు రైటింగ్ పోలికలు సంధ్య రైటింగ్‌లోనూ వున్నై. సంధ్యతో లీలారావ్‌కి పరిచయముండటంవలనే, ఆమెమీదికి అనుమానంరావాలని ఆమె గురించి కొన్ని పేజీలు కేటాయించింది. ఏమీ తోచనపుడు ఇంపార్టెంట్ కాని విషయాల్ని రాసుకున్న డైరీ ఇది. వాస్తవానికి భీమానాయుడు ఒరిజినల్ డైరీ ఆయన ఇంట్లో భార్య దగ్గరుంటుంది. ఏమ్మా! డైరీ తీసుకొచ్చారా?" అని పుష్పనుద్దేశించి అడిగాడు.

"ఇదిగో సర్" అంటూ రాజు అందించాడు.

"చాలాకాలం తర్వాత కలుసుకున్నారు గనుక ఇద్దరూ ఎంజాయ్ చేశారు. ఆ సమయంలోనే స్లీపింగ్ పిల్స్ ఇచ్చింది. సంధ్య తెలివయింది. నటరాజన్‌ని పిలిపించింది. ఎంచక్క గుండు గీయించింది—తిరుపతి వెళ్ళి వచ్చాడని డైరీలో రాసింది—"

"మరి రూమ్ తీసుకునేముందు గోవిందురెడ్డిగారు చూడలేదా?" సాయిబాబా అబకుచేశాడు.

"ఏమండీ గోవిందురెడ్డిగారూ! ఆయన గుండుతో రావడం—చూశారా!"

"ఆయన రావడం చూశాన్సార్. ఆయనకి గుండు వుందో—లేదో గుర్తు లేదు!" అన్నాడు రెడ్డి.

"బ్రౌన్ బ్రీఫ్‌కేసును తెరవండి!" అన్నాడు కిరణ్.

బలవంతంగా తెరిచారు. అందులో 'నైన్ లాక్స్' కేస్‌వుంది.

"ఫింగర్ ప్రింట్స్ చూడండి!" అన్నాడు. క్షణంలో తెలిసిపోయింది ఆ క్యాష్‌మీద వున్న ఫింగర్ ప్రింట్స్ సంధ్యవేనని.

"సో దిస్ క్యాష్ వజ్ స్టోలెన్ బై సంధ్య! అనుమానం రాకుండా గుండు గీయించింది. డాక్టరుగారూ! నిజంగా తిరుపతినుండి గుండు గీయించుకుని భీమా నాయుడు వస్తే ఈ సరికి మీ లెక్క ప్రకారం ఎన్ని సెంటిమీటర్ల జుత్తు ఎదుగుతుంది?"

"స్పర్శకు వెంట్రుకలు తగుల్తాయి—" అన్నాడు డాక్టరు.

"పరీక్ష చేయండి! నేను శవాన్ని చూడగానే పరీక్షించాను. నున్నగా వుంది. అంటే తిరుపతిలో గుండు గీయించుకున్న మరుక్షణం చంపబడ్డాడనా అర్థం—నో చంపేసి ఇలా గుండు గీయించారు తెలివిగా. అదే నా అనుమానాన్ని పెంచింది!" ఆగాడు కిరణ్.

"యూ ఆర్ పెర్ఫెక్ట్లీ కరెక్ట్!" అంటూ కళ్ళతో అభినందించాడు డాక్టరు.

"సంధ్య—చాలా తెలివిగా ప్రవర్తించింది. మిస్ లీలారావ్‌ని మంచిచేసుకొని, నన్ను వశపరుచుకుందామని ప్రయత్నించింది. పార్టీ ఎరేంజ్ చేయించింది. రాయల్ సెల్యూట్ నాకు పట్టించాలని చూసింది. లీలారావ్ సహకారంతో ద్రాక్షరసం త్రాగాను. మైకం వచ్చి పడిపోయినట్లు నటించాను. ఆటోమేటిక్ కెమెరా టేప్ రికార్డర్ అమర్చాను—సమయానికి రాజు సహకారంతో ఏ. సి. ఆఫ్ అయింది. సంధ్య మత్తులో గమ్మత్తుగా ప్రవర్తించింది. తన నోటితోనే నిజం చెప్పేసింది—" అంటూ టేప్ వినిపించాడు.

"ముత్తానికి ఘటికుడవయ్యా! ఇన్స్పెక్టర్ కిరణ్! ఈ కేసు పరిశోధనలో నీ కీర్తి మరింత పెరిగింది. కంగ్రాచ్యులేషన్స్. అవునూ చిన్న—డౌట్ మరి అనవసరంగా గోవిందురెడ్డిని, నన్ను-ఎందుకు జడిపించావయ్యా బాబూ?" అన్నాడు సాయిబాబా ఛలోక్తిగా.

"కావాలనే జడిపించాను. ఆ మాత్రం ఈ కేసుపట్ల భయం లేకపోతే ఈసరికి ఈ సంధ్య ఇతడ్ని గుప్పెటిలో వుంచుకునేది. అందుకే గోవిందురెడ్డికి ప్రాణంమీద అంత ఆశ పుట్టేలా చేశాను!

"ఏం సంధ్యాదేవిగారూ! ఇంకేవన్నా వాదించాలనుకుంటున్నారా?" అనడిగాడు కిరణ్.

సంధ్య తల వంచుకుంది. మాట్లాడలేకపోయింది. లీలారావ్‌ని అసహ్యంగా చూసి "యూ... యూ.... బ్రూట్!" అంది.

మిస్ లీలారావ్ తీయగా నవ్వింది.

"కంగ్రాట్స్‌లేషన్స్ మిష్టర్ కిరణ్! నువ్వు మన పోలీస్ డిపార్ట్‌మెంట్‌కే గర్వకారణమయ్యావు" అంటూ కరచాలనం చేశాడు డి.ఐ.జి. భాస్కర్రావు.

"వెల్ డన్ మై బాయ్! డాక్టర్లు కనిపెట్టలేని సైకలాజికల్ పాయింట్ నువ్వు కేప్చర్ చేసి పరిశోధన సాధించావు!" అంటూ షేక్‌హేండిచ్చాడు డి.యమ్.ఓ.

"ఇక ఈ శవాల్ని 'పోస్టుమార్టమ్'కి పంపిద్దామా!" అన్నాడు నవ్వుతూ డి.యమ్.ఓ.

"ఓ య్యాస్ సార్! తన గుట్టు బయటపెట్టకుండా నటరాజన్‌ని చంపిందికూడా సంధ్య!" అన్నాడు కిరణ్.

సంధ్య మరోసారి తల దించుకుంది.

గోవిందురెడ్డి కిరణ్ చేతులు పట్టుకున్నాడు. "ఇన్స

పెక్టర్ గారూ! నా హోటలు పరువు దక్కించారు. కొన్ని లక్షలు అప్పుచేసి కట్టిన ఈ హోటల్ ఈ రోజుతో మూత పడుతుందనుకున్నాను!" అంటూ కృతజ్ఞతా చిహ్నంగా చూశాడు.

కిరణ్, లీలారావ్ దగ్గరికి వచ్చాడు.

మిస్ లీలారావ్ తల దించుకుంది.

"థాంక్స్ వెరీమచ్ లీలారావ్! ఐ షల్ కీప్ యు ఇన్ మై హార్ట్ ఫరెవర్!" అంటూ షేక్ హాండిచ్చాడు. ఆ స్పర్శకు పులకించిపోయింది లీలారావ్. కళ్ళల్లో నీళ్ళు చిమ్మి చెంపలను తాకుతూ జారిపోయాయి.

పుష్ప, పిల్లల్తో దీనంగా నుంచుంది.

"ఈ డబ్బు మీకు చేరుతుంది! ఇందులో మూడులక్షలు వ్యాపారరీత్యా ఇచ్చిన అడ్వాన్సు.... నాయుడుగారూ! మీరు తీసుకోండి!" అంటూ పెద్దల సమక్షంలో మూడు లక్షల క్యాష్ ఇప్పించాడు, రశీదులు తీసుకొని.

"వుంటానమ్మ! మీకే సహాయం కావాలన్నా నన్ను పిలవండి!" అన్నాడు కిరణ్.

"అలాగే!" అంది బొటబొట కన్నీరు విడుస్తూ.

"ఇందులో రెడ్డిగారి కివ్వవలసింది!"

"వద్దు బాబూ! వారి కుటుంబానికే వుంచండి" అన్నాడు రెడ్డి.

"వద్దండీ మీకు రావలసింది మీరు తీసుకోండి!" అంటూ అతని డబ్బు అతనికిచ్చింది పుష్ప.

"రాజూ! మై ఫ్రెండ్ థాంక్స్!" అంటూ కౌగలించుకున్నాడు—ఇద్దరూ కాసేపు ఆప్యాయతా లోకంలో సంభ్రమించుకుపోయారు.

—:అయిపోయింది:—